కప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వేదికపైనే అధికారికంగా ప్రకటించాల్సి వచ్చింది. ఈ హైడ్రామా అనంతరం నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఫిరోజ్ ఖాన్ మీడియాతో మాట్లాడారు. కేవలం కుర్చీ విషయంలో జరిగిన చిన్న మిస్ అండర్‌స్టాండింగ్ వల్లే ఈ రచ్చ జరిగిందని ఆయన సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మంత్రి పక్కన కూర్చోవాలనే ఉద్దేశంతో అందరూ అనుకోవడం వల్లే ఈ కన్ఫ్యూజన్ క్రియేట్ అయిందని వివరణ ఇచ్చారు. ఉస్మాన్ అల్ హజ్రీ తనకు పెద్దన్నలాంటివాడని పేర్కొంటూ వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేశారు. ఇది పూర్తిగా తమ కాంగ్రెస్ కుటుంబ అంతర్గత విషయమని స్పష్టం చేశారు. బయటకు అంతా సవ్యంగానే ఉందని చెబుతున్నప్పటికీ, ఈ గొడవ వెనుక ఉన్న అసంతృప్తి తీవ్రమైనదనే చర్చ నడుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే నాంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. కేవలం 2000 పైచిలుకు ఓట్ల స్వల్ప తేడాతోనే ఫిరోజ్ ఖాన్ ఇక్కడ ఓటమి చవిచూశారు. ఎంఐఎం అభ్యర్థికి 56,000 పైగా ఓట్లు రాగా, ఫిరోజ్ ఖాన్‌కు సుమారు 54,000 ఓట్లు లభించాయి. ఈ ఓట్ల శాతం పార్టీ గ్రాఫ్‌ను భారీగా పెంచింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పట్టు కోసం నాయకుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 7 డివిజన్లలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో గ్రూపు రాజకీయాలు తెరపైకి వస్తున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని కాంగ్రెస్ సమీక్షల్లో ఇలాంటి ఘర్షణలు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనూ దాదాపు 30 శాతం స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై తీవ్ర వివాదాలు నడిచాయి. ఈ అంతర్గత పోరు కారణంగానే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఆశించిన స్థానాలను గెలుచుకోలేకపోయింది. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నేతలు ఇప్పటి నుంచే తమ గ్రూపులను యాక్టివేట్ చేస్తున్నారు. ఈ గ్రూప్ పాలిటిక్స్ కాస్తా ఇప్పుడు మంత్రుల ముందే బహిర్గతం కావడం గమనార్హం. ఈ పరిణామాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. క్రమశిక్షణ తప్పిన నేతలపై చర్యలు తీసుకునేందుకు క్రమశిక్షణా సంఘం నివేదిక కోరినట్లు సమాచారం. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ రసాభాసకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇలాంటి వీధి గొడవలు ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠినమైన గైడ్‌లైన్స్ జారీ చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో పార్టీ క్యాడర్‌ను యాక్టివేట్ చేసేందుకు వేసిన ఈ ప్లాన్ కాస్తా రివర్స్ అయింది. దాదాపు 500 మంది ముఖ్య కార్యకర్తలు హాజరైన ఈ సమావేశం ఇలా అర్ధాంతరంగా రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. గ్రూపు రాజకీయాలను చెక్ పెట్టేందుకు హైకమాండ్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. ఏదేమైనా, ఈ ప్రోటోకాల్ వార్ కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలను మరోసారి పొలిటికల్ స్క్రీన్‌పైకి తెచ్చింది. రాబోయే రోజుల్లో నాంపల్లి కాంగ్రెస్ రాజకీయం ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

## బాల్క సుమన్ వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరం



**ఆదిలాబాద్, విశాలభారతి:** శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ తీవ్రంగా ఖండించారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే బీఆర్ఎస్ నేతలు ప్రజలను హింస వైపు ప్రేరేపిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆడే గజేందర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయాలని పిలుపునివ్వడం పూర్తిగా చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ, "ఒక ఊరిలో ప్రజలు కష్టపడి నిర్మించుకున్న బడి, బావిని ఒక నాయకుడు తన పదవి కోల్పోయిన అసహనంతో ధ్వంసం చేయమని యువకులను రెచ్చగొట్టాడని, ఆ మాటలు నమ్మిన అమాయకులు చివరికి జైలుపాలయ్యారని, కానీ ఆ నాయకుడు మాత్రం సురక్షితంగా ఉన్నాడని" వ్యాఖ్యానించారు. బాల్క సుమన్ చేసిన "రైలు పట్టాలు కోయండి, సింగరేణి భవన్‌ను కాల్చేయండి" వంటి వ్యాఖ్యలు కూడా ఇలాంటివేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి సారిస్తోందని, అయితే బీఆర్ఎస్ మాత్రం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేలా ప్రేరేపించే నాయకుల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సమాజంలో హింసను ప్రేరేపించే చట్టవ్యతిరేక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆడే గజేందర్ హెచ్చరించారు.

## బోథ్‌లో టీఆర్ఎస్‌లో చేరికల జోరు

**బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సదానందంతో పాటు పలువురు టీఆర్ఎస్‌లో చేరిక**



**ఆదిలాబాద్ , విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని సోనాల మండల కేంద్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు సదానందంతో పాటు పలువురు అనుచరులు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో ఘనంగా చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని సూచించారు. టీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి విధానాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. సోనాల మండలంలోని పలు గ్రామాల నుంచి మరికొంత మంది నాయకులు, యువకులు త్వరలో టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సచిన్, వెంకటి, రామయ్య, సాయిరెడ్డి, ఎరేకారే వినీత్, సలీమ్, యూసుఫ్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు ఇళ్లు నేలమట్టం





**మునుగోడు విశాలభారతి:** గుండ్లోరిగూడెంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు బొల్లం రాములు పూరి గుడిసె,జంగిలి సైదులు రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి ఇళ్లునేల మట్టం కావడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు బుధవారం గ్రామ సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య గ్రామ పంచాయతీ సెక్రెటరీ రేణుక ఉపసర్పంచ్ గడగోటి రమణమ్మ రాంబాబు బాధితులను పరామర్శించారు, నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వారు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన భద్రాచలం ఎమ్మెల్యే



**వాజేడు, విశాలభారతి:** వాజేడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.. ఎంపీడీవో ఆఫీస్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన షాపింగ్ కాంప్లెక్స్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స పొందిన రెండు కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ కి అప్లై చేయగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సంబంధిత వ్యక్తులకు చెక్కులు స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వాజేడు తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, పార్టీ నాయకులు, కాకర్లపూడి విక్రాంత్ బాబు, ప్రసాద్ బాబు, మాజీ జెడ్పిటిసి తల్లాడి పుష్పలత, జగన్ వివిధ గ్రామ పంచాయతీ సర్పంచులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు పాల్గొన్నారు

## కాగజ్‌నగర్‌లో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ

**పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి: మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు**

ఆదిలాబాద్, విశాలభారతి: రాథోడ్ బాపురావు కావతి సబితా మనోహర్ పాల్గొనగా ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్‌లో టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఉత్సాహభరిత వాతావరణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ జెండా పండుగ స్టేట్ అబ్జర్వర్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గారు, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావేటి సబితా మనోహర్ గారితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ అని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని నాయకులకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం పార్టీ నినాదాలతో మారుమోగింది. "జై కవితక్క.. జై జై కవితమ్మ" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.




# ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వెంటనే పరిష్కారం చూపాలి

**100 రోజుల పనులు, గ్రామీణ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: మంత్రి సీతక్క**

**మహబూబాబాద్, విశాలభారతి:**



ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడ మండల కేంద్రం, ఓటాయి గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఆర్డీఓ కృష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం తదితర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. గతంలో రూ.5 లక్షల వరకు మాత్రమే రుణాలు ఉండగా, ప్రస్తుతం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల ఉపాధి హామీ పనులు, సీసీ రోడ్లు, చెక్‌డ్యాములు, అంతర్గత రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా రహదారుల నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు. ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఇండ్ల స్థలాలు, ఆసరా పెన్షన్లు, భూమి సమస్యలు, రేషన్ కార్డులు, తాగునీరు, రోడ్లు, వైద్య సహాయం వంటి అంశాలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కొన్ని సమస్యలను మంత్రి అక్కడికక్కడే సంబంధిత అధికారులకు పంపించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రజల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా దర్బార్‌లో ఓటాయి గ్రామంలో 167, కొత్తగూడ రైతు వేదికలో 142, మొత్తం 309 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వాటి పరిష్కారం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి సంబంధిత శాఖలకు పంపినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బెదిరింపులతో రూ.50 వేల వసూళ్లు

**ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఇచ్చోడ పోలీసులు**



**ఆదిలాబాద్ , విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం పరిధిలో వ్యక్తిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె నరేష్ కుమార్ వెల్లడించారు. సిరిచల్మ గ్రామానికి చెందిన రాజారపు సందీప్ ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గ్రామానికి చెందిన అబ్దుల్ అజీమ్, కాలా రవీందర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, బాధితుడికి ఒక మహిళతో అక్రమ సంబంధం ఉండగా ఆ విషయం ఆమె భర్తకు తెలిసింది. అనంతరం అబ్దుల్ అజీమ్, కాలా రవీందర్ కలిసి గ్రామంలో పంచాయతీ నిర్వహించి, విషయం బయటపడితే పరువు పోతుందని హెచ్చరిస్తూ సమస్య పరిష్కారానికి రూ.1.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించడంతో భయాందోళనలకు గురైన బాధితుడు తన సోదరుడు ద్వారా రూ.50 వేల నగదును వారికి అందజేసినట్లు ఫిర్యాదులో వెల్లడించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ కె నరేష్ కుమార్ తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వరి ధాన్యం జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలి

- **వరి రైతులను తూకం పేరుతో మోసం చేయడం తగదు**
- **వరి ధాన్యం రవాణా చార్జీలు రైతులపై మోపడం సరికాదు**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుస్స చంద్రయ్య**



**కొడంగల్, విశాలభారతి :**

వరి ధాన్యం అమ్మబోతే రైతులకు అష్ట కష్టాలు పడక తప్పండంలేదని ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యంతో రైతులు వారాల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తూ నరకయాతన పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుస్స చంద్రయ్య అన్నారు, బుధవారం దౌల్తాబాద్ మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ తూకం కోసం కుప్పలు పోసిన రాసుల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని ధాన్యం కొనుగోలు మందకోడిగా సాగడంతో నెల రోజులకు పైగా పటికాపులు కాయవలసి వస్తుందని వర్షాకాలం వ్యవసాయ పనులు కుంటుపడుతున్నాయన్నారు, నిత్యం వర్షాలు పడడంతో ఆరబెట్టడం, కుప్పలు చేయడం కోసం అదనపు వ్యయప్రయాసాలు పడుతున్నారన్నారు, నిబంధన ప్రకారం ధాన్యం కొనుగోలు చేసే సమయంలో బస్తాకు 41 కిలోల 500 గ్రాములు తూకం ఉండాలి, కానీ ధాన్యం తూకం సమయంలోనే అనేక కారణాలను చూపుతూ మూడు నుంచి నాలుగు కిలోల వరి ధాన్యాన్ని అదనంగా తీస్తూ రైతులను నిలువున ముంచుతున్నారన్నారు. రైతులు పండించిన పంటకు లాభం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్ల నుండి రైస్ మిల్లులకు వరి ధాన్యాన్ని తరలించేందుకు రైతులే రవాణా చార్జీలు భరించడంతో పండించిన పంట రవాణా చార్జీలకే వేచించవలసి వస్తుందన్నారు. రవాణా చార్జీలు రైతులపై వేయకుండా రవాణా చార్జీలను రైతులకు అందించాలన్నారు. రైతులు వరి కోసి నెల రోజుల పై కావస్తున్న ఇప్పటివరకు దాన్యం అమ్మ లేక నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అమ్మ పోతే అడవి.. కొనబోతే కొరవి అన్న చందంగా అన్నదాతల పరిస్థితి ఉందన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు పడరాని పాట్లుపడుతున్నారన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అమ్ముకుంటే ధాన్యం రైతును నిలువున దోచుకుంటున్నారన్నారు. వరి ధాన్యం రైతులకు ప్రతి సంవత్సరం అమ్ముకునేందుకు కష్టాలు తప్పడం లేదన్నారు. వర్షాలు పడడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా దాన్యం కొనుగోలులో జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాములు, మల్లయ్య, వెంకటప్ప, బసప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ద్వారా అంబేద్కర్ భవనాన్ని పూర్తి చేయాలి

- **కమిటీ లేకుండా ఒంటెద్దు పోకాడ సరికాదు**
- **హైస్కూల్ మాజీ చైర్మన్,మూడో బూత్ సభ్యులు దళిత సీనియర్ నాయకులు మిరియాల లక్ష్మయ్య.**
- **మాల మహానాడు గ్రామ కమిటీ అధ్యక్షులు కామెండ్ల ఆనందం**

**కురవి విశాలభారతి:**



గత 10 సంవత్సరాలుగా నిలిపి ఉన్న అంబేద్కర్ భవనాన్ని కొత్త కమిటీ వేసి భవన నిర్మాణం పూర్తి చేయాలని హైస్కూల్ మాజీ చైర్మన్,మూడో బూత్ సభ్యులు దళిత సీనియర్ నాయకులు మిరియాల లక్ష్మయ్య, డిమాండ్ చేశారు.అదేవిధంగా మాల మహానాడు గ్రామ కమిటీ అధ్యక్షులు కామెండ్ల ఆనందం మాట్లాడుతూ, అంబేద్కర్ భవన నిర్మాణం నూతన కమిటీ వేసి భవనాన్ని పూర్తి చేయవలసిందిగా ఒకరిద్దరూ తో భవనాన్ని పూర్తి చేస్తానని ఒంటెద్దు పోకడ పోవడం సరైంది కాదని అందర్నీ కలుపుకొని వారి ఆలోచన మీదుగా భవన పూర్తి చేసుకునే అవకాశం మనందరికీ ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంబేద్కర్ భవనంలోని తాత్కాలికంగా నిలిపి వేసిన భవనాన్ని నిర్మాణం కొరకు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులను కల్పుకపోకపోవడం వల్లన నిరాశ నిస్పృహాలకు లోనైనరు అన్ని తెపినారు.కొరివి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం మా వంతు సహాయ సహకారాలు భవనానికి అందించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.అసలు భవనానికి ఎంత ఖర్చవుతుందని ఎస్టిమేషన్ లేకుండా పోతే భవనానికి మళ్ళీ 10 సంవత్సరాలు వెనకకి పోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఒక కమిటీ వేయాలని భవనానికి నిధులు సేకరించి పూర్తి చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కామెండ్ల వెంకటేశ్వర్లు, మండల రామచంద్రు,కామెండ్ల వీరన్న,వడ్డేటి వెంకటయ్య,పేరమళ్ళ యాదనాయకం, బొర్గుల కృష్ణ, గాజుల వీరన్న, గండమాల రోశయ్య, కామెండ్ల వీరన్న, వీరమల్ల విద్యాసాగర్, దుండ్ర ఉప్పలయ్య, కందుల అనిల్ లు తదితరులు పాల్గొన్నారు.


## కురవిలో ఘనంగా జయసాయి, శరణ్యాల పంచకట్టు చెవికుట్టు వేడుకలు



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్ నాయక్ కుటుంబ సభ్యులు నిర్వహించిన జయసాయి, శరణ్యల పంచకట్టు మరియు చెవికుట్టు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆహ్వానితుల సమక్షంలో వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా మరియు మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్ సూచనలు**



**మహబూబాబాద్, విశాలభారతి:** జూన్ 2న కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై ప్రసంగ కాపీని సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే వేదిక, సీటింగ్, స్నాక్స్, సౌండ్ సిస్టమ్, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని, కార్యక్రమ ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ నేపథ్యంలో మసీదులు, స్లాటర్ హౌస్‌ల పరిశీలన

**నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి.**



**విశాలభారతి గోదావరిఖని:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదులు, స్లాటర్ హౌస్‌లను గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సంబంధిత వెటర్నరీ వైద్యుడు డాక్టర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన జాగ్రత్తలు,ప్రభుత్వ నిబంధనలను నిర్వాహకులకు వివరించారు.వెటర్నరీ డాక్టర్ ధృవీకరణ పత్రం లేకుండా పశువులను వధించరాదని స్పష్టం చేశారు.వధ ప్రక్రియ సమయంలో పరిశుభ్రత, ప్రజారోగ్యం, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కోరారు.

## అర్హులందరికీ న్యాయం చేస్తా: కలెక్టర్ సత్య శారద

**విశాలభారతి, వరంగల్ :** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం చెన్నారావుపేట మండలంలోని ఝల్లి, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయిగూడెం గ్రామాల పరిధిలో70 మరియు 314 సర్వే నెంబర్ గల భూమిని ఎస్సీ మరియు బిసి కులాలకు సంబంధించినటువంటి రైతులు 60 సంవత్సరాలు సాగులో ఉండి గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు రంగుల పట్టా ఇచ్చి ప్రభుత్వ పథకాలకు అరువులుగా గుర్తించి బ్యాంకు రుణాల అందించి ప్రభుత్వ సొసైటీ లోను కూడా తీసుకోవడం జరిగింది అట్టి భూమిని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫారెస్ట్ ల్యాండ్ గా గుర్తించడంతో సేద్యం లో ఉన్న రైతులు తమ భూమికి ఇప్పుడున్న ప్రభుత్వంలో ఎలాంటి హక్కులు పొందకుండా పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టర్ కి ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో ఈ భూమికి అన్ని రకాల హక్కులు కల్పించాలని కోరుకున్నారు అట్టి అటవీ భూముల సమస్యలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా అటవీ శాఖ అధికారి నికిత మరియు నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఉమారాణి లు పాల్గొన్నారు. భూముల హక్కులు, సాగు పరిస్థితులు, స్థానిక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో కలిసి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పుడున్న ఉమ్మడి మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్ డి సి ఓ అధికారి సొసైటీ రికార్డులను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో డిసిఓ నీరజ, చెన్నారావుపేట మండల్ తాసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్ మరియు గ్రామస్తులు వీరి వెంట ఉన్నారు.





## ఏజెన్సీ రైతులు, ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

**మంత్రి సీతక్కకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వినతిపత్రం.**



**మహబూబాబాద్ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా ఏజెన్సీ మండలాల్లో రైతాంగం, ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర (ఎంఎస్పీ)తో ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. గిరిజన సహకార సంస్థ (జిసిసి) ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీ ధరలపై సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల పంపిణీలో అమలవుతున్న కఠిన యాప్ నిబంధనలను రద్దు చేసి, ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల్లో వ్యవసాయానికి అంతరాయం లేని 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందించాలని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గోదాములు, మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయడంతో పాటు అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రతి మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించి సాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపరిచి, ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యలను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పరిష్కరించి రైతాంగం, ఆదివాసీలను ఆదుకోవాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కోరారు.

## పెంకు కార్మికుల వేతనాల పెంపుదలకై పోరాడుదాం!

- **సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా**
- **తెలంగాణ టైల్ వర్కర్స్ రాష్ట్ర జనరల్ బాడీ సభ విజయవంతం**



**బయ్యారం విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా, బయ్యారం కొత్తపేట, మే 27 : పెంకు కార్మికుల సమస్యల పరిష్కారం, వేతనాల పెంపుదల కోసం ఐక్యంగా పోరాడాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తపేటలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం వై బాబుల శ్రీను, బుగ్గ రవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా మాట్లాడుతూ దేశంలో అసంఘటిత రంగ కార్మికులు కోట్ల సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి తగిన వేతనాలు, సంక్షేమ సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంకు కార్మికులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నప్పటికీ సరైన వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెంకు కార్మికుల వేతనాలు పెంచే వరకు ఉద్యమాలు, పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎస్.కె మదర్, రామ్ సింగులు అవినీతి, అక్రమాలకు పాల్పడిన కారణంగా తెలంగాణ టైల్ వర్కర్స్ యూనియన్ నుంచి తొలగించామని, వారికి ఐఎఫ్టియూతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వై బాబుల శ్రీను, కార్యదర్శిగా నెల్లూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.కె పాషా, ఎన్ కోటయ్య, సహాయ కార్యదర్శులుగా పి సాంబయ్య, బుగ్గ రవి, కోశాధికారిగా వంగూరి వెంకన్నతో పాటు మరో 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పంట అవశేషాలను కాల్చి రైతులు ఇబ్బందులకు గురి కావద్దు

- **నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్**



**కురవి విశాలభారతి:** పంట అవశేషాలు కాల్చి రైతులు అనవసరంగా ఇబ్బందులకు గురికావద్దని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నరసింహారావుతో కలిసి పరిశీలించి రెండు, మూడు రోజులలో మొత్తం ధాన్యం మిల్లులకు తరలించే విధంగా త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను కోరారు, రైతులతో మాట్లాడుతూ పత్తి, వరి, మొక్కజొన్నలాంటి ఇతర పంటల అవశేషాలను రైతులు అవగాహన లోపంతో కాల్చడం వల్ల భూసారము దెబ్బతిని, ఉపయోగపడే అనేక సూక్ష్మజీవులు చనిపోవడంతో ఎన్ని మందులు వేసిన పంట దిగుమతి రాదని, అంతేకాకుండా కాల్చడం వలన పక్కనే ఉన్న ఇతర పంటలు కాలిపోతున్నాయని, మోనో కార్బన్డయాక్సైడ్ విడుదల కావడంతో దానిని నిలిచిన పక్క రైతులు ఊపిరాడక అనేక ప్రాంతాల్లో చనిపోవడం తో అనేక నష్టాలు ఉన్నందున ఉన్నందున పర్యావరణ చట్ట ప్రకారం జరిమానాలు, జైలు శిక్షలతో రైతులు ఇబ్బందుల పాలుకాకుండా, పంట అవశేషాలను భూమిలోనే కలియ దున్నడంతో అనేక ఉపయోగాలు కలుగుతాయని అన్నారు. ఈ సీజన్లో యూరియా వాడకం తగ్గించి జింక్, పొటాషియం లాంటి సూక్ష్మ పోషకాలు ఎక్కువ మోతాదులో వాడి భూమిని సారవంతంగా ఉంచుకొని అధిక దిగుబడి పొందవచ్చును కోరారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర బాధ్యులు శ్రీపాల్, సంగెం రమ, రేణుక, పద్మ, బొల్లం ఉప్పలయ్య, బత్తిని నర్సయ్య, వెంకటయ్య అప్పాల వెంకన్నలు. పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో S.I.R విజయవంతం చేయాలి

**ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు**

**బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలి : కళ్లెం నవజీవన్ రెడ్డి**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహిస్తున్న S.I.R (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లి విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. S.I.R కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి బూత్‌లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు, మోర్చాల అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబం ఆర్థిక,సామాజికంగా వృద్ధి చెందాలంటే విద్య అవసరం

- **ఎన్ కిషోర్ రెడ్డి చైర్మన్ స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ**
- **టైలరింగ్ ఎంబ్రాయిడింగ్ వృత్తి ద్వారా ఆదాయం**
- **మోగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్**



**చౌటుప్పల్ విశాల భారతి:**

మండలంలోని గ్రామీణ యువత స్వయం సమృద్ధి సాధించేందుకు నైపుణ్య శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ కిషోర్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్‌లో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణ పొందిన మహిళలకు స్థానిక పురపాలక చైర్ పర్సన్ మోగదాల పావని తో కలిసి సర్టిఫికెట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ..1995లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు దూర దృష్టితో గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని జలాల్పురం గ్రామంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించారని తెలిపారు. ఈ సంస్థలో 18 రకాల వృత్తి విద్య కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. 400 మందికి హాస్టల్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు ప్రతి కుటుంబం ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలంటే మంచి విద్యా అవసరం అన్నారు. మహిళలు కూడా స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లయితే వారికి కుటుంబంలో గౌరవం ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అనంతరం పురపాలిక చైర్ పర్సన్ మోగుదల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ..తాను కూడా స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందాలని తెలిపారు. టైలరింగ్ ఎంబ్రాయిడరీ శిక్షణ పొందిన మహిళలు ఈ వృత్తి ద్వారా ఆదాయం సంపాదించాలని సూచించారు. చౌటుప్పల్ లైన్స్ క్లబ్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్‌గుప్తా అధ్యక్షత వహించిన, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథ్, లయన్స్ జోనల్ చైర్మన్ పోలోజు శ్రీనివాసచారి, కార్యదర్శి అతహర్ పాషా, కోశాధికారి సిలువేరు మంగయ్య, గోశిక కరుణాకర్, లయన్స్ క్లబ్ సభ్యులు, ఇన్స్ట్రక్టర్ రుద్ర బాలభారతి తదితరులు పాల్గొన్నారు.

## కాల్చితే కాలుష్యం.. కలియదున్నితేనే భూసారం

- **పర్యావరణాన్ని కాపాడుకుందాం.. భూమాతను రక్షించుకుందాం**
- **రైతులకు చిన్నగూడూరు ఎస్సై కుశకుమార్ సూచనలు**



**మరిపెడ విశాలభారతి:**

వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలు, పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల భూమి సారవంతతతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చిన్నగూడూరు ఎస్సై కుశకుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవగాహన లేమితో రైతులు వరి మాగిళ్లను కాల్చివేయడం భవిష్యత్‌లో వ్యవసాయానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల మట్టిలోని తేమ పూర్తిగా ఆవిరైపోవడంతో పాటు భూమికి అవసరమైన సేంద్రీయ కార్బన్, నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు నశిస్తాయని చెప్పారు. అంతేకాకుండా భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు మంటల వేడికి మరణిస్తాయని వివరించారు. పర్యావరణ సమతుల్యతకు ఉపయోగపడే పాములు, ముంగిసలు, ఉడుములు వంటి జీవరాశులు కూడా అగ్నికి ఆహుతవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల గాలిలో అధికంగా పొగ, బూడిద కలవడంతో వాయు కాలుష్యం పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా ఒక పొలం నుంచి మరో పొలానికి మంటలు వ్యాపించి భారీ నష్టం సంభవించే అవకాశాలు కూడా ఉన్నాయని హెచ్చరించారు. రైతులు వరి మాగిళ్లను కాల్చకుండా వ్యవసాయ యంత్రాల సహాయంతో చిన్న ముక్కలుగా చేసి పొలంలో కలియదున్నాలని సూచించారు. అనంతరం నీరు పెట్టి రోటావేటర్ లేదా కేజ్‌వీల్ చక్రాలతో దున్నితే అవి త్వరగా కుళ్లి సేంద్రీయ ఎరువుగా మారుతాయని తెలిపారు. ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా వేస్ట్ డీకంపోజర్ వినియోగిస్తే రెండు నుంచి మూడు వారాల్లోనే పంట అవశేషాలు కుళ్లిపోయి భూమికి మేలు చేసే సేంద్రియ ఎరువుగా మారుతాయని చెప్పారు. దీని ద్వారా తదుపరి పంట దిగుబడి 5 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశముందని వెల్లడించారు. వరి కొయ్యలను తగలబెట్టడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఎస్సై కుశకుమార్ హెచ్చరించారు. రైతులందరూ పంట వ్యర్థాలను కాల్చివేయకుండా భూమిలో కలియదున్ని భూసారాన్ని పెంచుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## “మీ సురక్ష – మా బాధ్యత”పై కాలనీవాసులకు పోలీసుల అవగాహన



**వర్కర్ల పూర్తి వివరాలను గూగుల్ లింక్‌లో నమోదు చేయాలని సూచన**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:**

“మీ సురక్ష - మా బాధ్యత” కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్‌లోని దత్తాత్రేయ నగర్ కాలనీలో పోలీసు అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ, హయత్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు గౌడ్ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని కాలనీవాసులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పనిచేస్తున్న వర్కర్లు, గృహ సహాయకులు, కార్మికుల పూర్తి వివరాలను పోలీసు శాఖ అందజేసిన గూగుల్ లింక్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు సులభమవడంతో పాటు కాలనీల భద్రత మరింత బలోపేతం అవుతుందని అధికారులు




తెలిపారు. అదేవిధంగా కాలనీవాసులు అపరిచితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ నగర్ కాలనీవాసులు, యువకులు, మహిళలు పాల్గొని పోలీసు అధికారులతో భద్రతా అంశాలపై చర్చించారు.

## విఒ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాలభారతి, పాలకుర్తి:**

పాలకుర్తి మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో మహిళా వి ఒ భవన నిర్మాణానికి బుధవారం రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు శాశ్వత వేదికగా ఈ భవనం ఉపయోగపడటంతో పాటు వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక-సామాజిక స్థితిగతులు మెరుగుపడేందుకు ఇలాంటి నిర్మాణాలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ న్యాయం చేస్తా.. కలెక్టర్ సత్య శారద



**విశాలభారతి:** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం చెన్నారావుపేట మండలంలోని ఝల్లి, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయిగూడెం గ్రామాల పరిధిలో 70 మరియు 314 సర్వే నెంబర్ గల భూమిని ఎస్సీ మరియు బిసి కులాలకు సంబంధించినటువంటి రైతులు 60 సంవత్సరాలు సాగులో ఉండి గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు రంగుల పట్టా ఇచ్చి ప్రభుత్వ పథకాలకు అరువులుగా గుర్తించి బ్యాంకు రుణాల అందించి ప్రభుత్వ సోసైటీ లోను కూడా తీసుకోవడం జరిగింది అట్టి భూమిని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫారెస్ట్ ల్యాండ్ గా గుర్తించడంతో సేద్యం లో ఉన్న రైతులు తమ భూమికి ఇప్పుడున్న ప్రభుత్వంలో ఎలాంటి హక్కులు పొందకుండా పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టర్ కి ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో ఈ భూమికి అన్ని రకాల హక్కులు కల్పించాలని కోరుకున్నారు అట్టి అటవీ భూముల సమస్యలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా అటవీ శాఖ అధికారి నికిత మరియు నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఉమారాణి లు పాల్గొన్నారు. భూముల హక్కులు, సాగు పరిస్థితులు, స్థానిక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో కలిసి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పుడున్న ఉమ్మడి మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్ డి సి ఓ అధికారి సొసైటీ రికార్డులను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో డిసిఓ నీరజ, చెన్నారావుపేట మండల్ తాసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్ మరియు గ్రామస్తులు వీరి వెంట ఉన్నారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాను: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాల భారతి ఎన్ టిపిసి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం ఎన్‌టీపీసీలోని మిలీనియం హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడని అన్నారు.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం నుంచి ఎన్నికల సమయంలో కష్టనష్టాలను లెక్కచేయకుండా పని చేసే ప్రతి కార్యకర్తే పార్టీకి నిజమైన బలం అని కొనియాడారు. తన విజయంలో కార్యకర్తల శ్రమ, అంకితభావం ఎంతో ఉందని, వారి సేవలను ఎప్పటికీ మరువనని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, వారికి ఏ సమస్య వచ్చినా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం, గౌరవం తనకు ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పని చేసి ప్రజల విశ్వాసాన్ని మరింతగా గెలుచుకోవాలని సూచించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, గ్రామాలు మరియు పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ రామగుండం ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, దిటి బాలరాజు, ఎండీ ముస్తఫా, అసిఫ్ పాషా, పెండ్యాల మహేష్ తో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నెహ్రూ చూపిన బాటలో నడుద్దాం: ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి



- **నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే ఘన నివాళి**
- **ఆ మహనీయుడి సేవలను స్మరించుకున్న ఎమ్మెల్యే**
- **ప్రతి ఒక్కరు నెహ్రూ చూపిన మార్గంలో నడవాలని పిలుపు**

**నిజామాబాద్, విశాలభారతి:** భారతదేశ తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమర యోధులు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని నిజామాబాద్ రూరల్ నియోజవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మహనీయుడి 62 వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆ మహనీయుడు నడిపిన కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

## బాధిత కుటుంబాలను విమర్శించిన సునీత కొమ్మలు నాయక్

**విశాలభారతి, గూడూరు:** గూడూరు గ్రామపంచాయతీ లోని పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన జల్లే వీరమ్మ సిబ్బంది వంగూరి సంతోష్ తండ్రి (వంగూరి వెంకన్న) అనారోగ్యంతో మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్ గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి ఉప సర్పంచ్ చంటి స్వామి. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య. జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండి రసూల్. వార్డు మెంబర్లు చీర బోయిన కుమార్. పద్యం వెంకన్న. గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. రాస మల్ల రాములు. పొన్నం వెంకన్న. తదితరులు పాల్గొన్నారు.



# 101 సర్వే నంబర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జా



శేరిలింగంపల్లి తహసిల్దార్ కి ఫిర్యాదు చేస్తున్న ఎంసీపీఐ (యూ ) నగర కార్యదర్శి పల్లె మురళి



చెరువు పై భాగంలో కబ్జా చేసి నిర్మిస్తున్న భవనం




లేఔట్ కాపీ (ఫైల్)

- ఆరు అంతస్తుల అక్రమ నిర్మాణం
- తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంసీపీఐ(యూ) ఫిర్యాదు

**మియాపూర్, విశాల భారతి**

దీప్తి శ్రీ నగర్‌కు ఆనుకుని రేగులకుంట చెరువు పైభాగంలోని 101 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఆరు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారని ఎంసీపీఐ(యూ) సహాయ కార్యదర్శి పల్లె మురళి ఆరోపించారు. నకిలీ డాక్యుమెంట్లతో అనుమతులు పొందారని, దీప్తి శ్రీ నగర్ ఆమోదిత లేఔట్‌లో ఆ స్థలం ప్రభుత్వ భూమిగా ఉందని, లేఔట్ కాపీలను అధికారులకు అందజేశామని తెలిపారు.ప్రభుత్వ భూముల్లో అనధికార నిర్మాణాల వల్ల చెరువు పరిసరాలకు, ప్రజా ప్రయోజనాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సీఎంసీ మియాపూర్ సర్కిల్ 48 ఉప కమిషనర్ శశిరేఖ, ఏసీపీ టౌన్ ప్లానింగ్ రాణికి ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్ మహిపాల్ రెడ్డిని కలిసి వివరించగా, స్థల పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.అక్రమ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, భవనాన్ని కూల్చివేసి ప్రభుత్వ భూమిని రక్షించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పల్లె మురళి డిమాండ్ చేశారు. ఫిర్యాదు ప్రతులను హైడ్రా కమిషనర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, శేరిలింగంపల్లి ఎమ్మార్వో, శేరిలింగంపల్లి జోన్ కమిషనర్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు వెల్లడించారు.

## ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు

**త్యాగం, దాతృత్వానికి ప్రతీక ఈద్ అల్ అదా : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు.త్యాగాలకు ప్రతీకగా నిలిచే ఈద్ అల్ అదా (బక్రీద్) పండుగను ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసం ఉంచి సన్మార్గంలో జీవించాలని ఈ పండుగ సందేశం ఇస్తుందని పేర్కొన్నారు.తమకు ఉన్నదాంట్లో నుంచి అవసరమైన వారికి పంచిపెట్టే దాతృత్వ భావనను బక్రీద్ పండుగ పెంపొందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో ప్రేమ, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.ముస్లింలందరూ ఆనందోత్సాహాల మధ్య బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని, రాష్ట్ర ప్రజలతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలపై అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు.

## ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మహిళలకు చీరల పంపిణీ


- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున మహిళలకు బహుమతులు
- మహిళా అభివృద్ధే తెలంగాణ ప్రగతి అని వెల్లడి




**మొయినాబాద్ , విశాలభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమతి బిల్లపాటి కవిత ఎల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున చీరలను పంపిణీ చేశారు. పొదుపు సంఘాల మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాల పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి అనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళల అభివృద్ధే తెలంగాణ పురోగతికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోటి కౌన్సిలర్లు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి మృతి తట్టుకోలేక.. తల్లి కొడుకుల ఆత్మహత్య

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో విషాద ఘటన.. సూసైడ్ నోట్‌లో డిప్రెషన్ కారణమని వెల్లడి





**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన తల్లి, కుమారుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ వివరాలను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కనకదుర్గానగర్ కాలనీ, లష్కర్‌గూడ రోడ్డుకు చెందిన పూసల కలావతి (45) టైలర్‌గా జీవనం సాగిస్తోంది. ఆమె భర్త కలాధర్ ఆరు నెలల క్రితం మృతి చెందగా, అప్పటి నుంచి కుటుంబం తీవ్ర మనోవేదనలో ఉన్నట్లు తెలిసింది. బుధవారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో కలావతి, ఆమె కుమారుడు శివకుమార్ (20) ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని మృతిచెందిన స్థితిలో గుర్తించారు. సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులకు శివకుమార్ రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. తండ్రి మరణంతో తీవ్ర డిప్రెషన్‌కు గురై జీవితం పట్ల విరక్తి చెందినట్లు ఆ నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి వెల్లడించారు.ఈ విషాద ఘటనతో కనకదుర్గానగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 18 సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్, విశాలభారతి:** బుధవారం మధ్యాహ్నం సమయంలో బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం యందు మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 18 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్., ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని , సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని , సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాద్యత గా తీసుకోవాలి. నగల దుకాణాల యజమానులు తప్పనిసరిగా CC కెమెరా లు పెట్టుకోవాలి. బస్సాపూర్ గ్రామంలో 18 కెమెరాలు పెట్టి సహకరించిన గ్రామ పంచాయతీ పాలకవర్గనికి సీపీ అభినందించారు. ఈ సందర్భంగా బస్సాపూర్ గ్రామంలో డ్రగ్స్ నివారణ , సైబర్ క్రైమ్ పట్ల అవగాహన, రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం అన్నీ రకాల జాగ్రత్త లు తీసుకోవాలని అన్నారు. పంట పొలాలలో ఎవరు కూడా మంటలు పెట్టారాదని , అందుకోసం మల్టీ పోటాషియం మందులు వాడినట్టుయితే భూసంద్రత బాగుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏ. సి. పి. శ్రీ జె. వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ రూరల్ సి. ఐ శ్రీ జాన్ రెడ్డి , బాల్కొండ ఎస్. ఐ శ్రీ శైలందర్, బస్సాపూర్ సర్పంచ్ శ్రీ శ్రీనివాస్ శ్రీరాంపూర్ సర్పంచ్ శ్రీ ఎర్రన్న , గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది.

## జవహర్ లాల్ నెహ్రూకి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు




**నిజామాబాద్, విశాలభారతి:**

నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు భారత తొలి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా డిసిసి నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం నెహ్రూ పార్కు లోని నెహ్రూ గారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ గారు దేశ ప్రధానిగా దేశానికి ఎనలేని సేవ చేశారని ,స్వాతంత్ర్య ఉద్యమంలో కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ అభివృద్ధిలో నెహ్రూ గారి పాత్ర కీలకమని అన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు గుండు పిన్ను కూడా తయారు చేయలేని స్థితిలో ఉన్న దేశం ఈ రోజు ప్రపంచ దేశాలతో పోటీ పడుతుంది అంటే అది నెహ్రూ గారి దూరదృష్టి వల్లనే అని,ఆయన చేసిన సంస్కరణలు దేశ ప్రజలు మరిచిపోలేరని అన్నారు.దేశంలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారని,వ్యవసాయ రంగం కొరకు ఆయకట్టలు నిర్మించారని దానికి భాక్రనంగల్ వంటి ప్రాజెక్టులు ఉదాహరణ అని,నిజామాబాద్ జిల్లాలో కూడా శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మించి జిల్లా ప్రజలకు సాగు,త్రాగు నీటి సౌకర్యం కల్పించారని తెలిపారు.యువతకు మెరుగైన విద్య కొరకు ఐఐటీ లు, శాస్త్రీయ పరిశోధన సంస్థలు ఏర్పాటు చేశారని అన్నారు. దేశానికి సేవలు అందించిన నెహ్రూ గారు 1964 మే 27 న కన్ను మూసారని,ఆయన చేసిన సేవలు జిల్లా ప్రజలు ఎన్నటికి మరువలేరు అని,ఆయన చూపిన మార్గంలో యువకులు నడిచి దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కానీ ప్రస్తుతం దేశంలో ఉన్న బీజేపీ నాయకులు నెహ్రూ గారిని తక్కువ చేసే ప్రయత్నం చేస్తున్నారని,ఆకాశంపై ఉమ్మివేస్తే అది వారిపైనే పడుతుంది అని బీజేపీ నాయకులు గమనించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికవర్ హాస్పిటల్స్ 'మిషన్ మిలియన్ హార్ట్స్' ప్రారంభం

**CPR అవగాహన, హీట్ స్ట్రోక్ నివారణపై భారీ వాక్‌థాన్"**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**




ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్స్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో భారీ అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా "మిషన్ మిలియన్ హార్ట్స్" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు నిర్వహించిన ఈ వాక్‌థాన్‌లో వైద్యులు, నర్సులు, మెడికల్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. (కార్డియో పల్మనరీ రీససిటేషన్), బేసిక్ లైఫ్ సపోర్ట్ వంటి ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డా. నయన్ శ్రీరాములు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమని, సరైన సమయంలో సిపిర్ అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. "మిషన్ మిలియన్ హార్ట్స్" ద్వారా 10 లక్షల మందికి శిక్షణ అందించడం లక్ష్యమని చెప్పారు. వేసవి నేపథ్యంలో హీట్ స్ట్రోక్ నివారణపై కూడా ప్రజలకు సూచనలు అందించారు. ద్రవాలు ఎక్కువగా తీసుకోవడం, ఎండలో ఎక్కువసేపు ఉండకపోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజల్లో అత్యవసర వైద్య అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.

## హయత్‌నగర్‌లో విషాదం.. లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**రోడ్డు దాటుతుండగా ప్రమాదం – చికిత్స పొందుతూ ఉస్మానియాలో కన్నుమూత**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ వివరాలను హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం (26.05.2026) సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో హయత్‌నగర్‌లోని లేబర్ అడ్డా సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా, ఎల్‌బీనగర్ వైపు నుంచి విజయవాడ దిశగా వెళ్తున్న TS29T9629 నంబరు గల లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ సహాయంతో గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 50 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, చూడటానికి బిక్షగాడిలా ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఇంకా గుర్తించలేదని, ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ కోరారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## తోగ్గూడెంలో తీరిన తాగునీటి కష్టాలు

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో విద్యుత్ బోరు ఏర్పాటు.. గ్రామస్తులు హర్షా తిరేకాలు**

**పినపాక, విశాలభారతి :** తోగూడెం గ్రామపంచాయతీలోని ఎస్ టీ కాలనీ కింది గుంపు గ్రామస్తుల 20 ఏళ్ల తాగునీటి కల బుధవారం సాకారమైంది. తాగునీటి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను తోగ్గూడెం గ్రామస్తులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తక్షణమే విద్యుత్ బోరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం బుధవారం సంబంధిత శాఖ అధికారులు విద్యుత్ బోరును ఏర్పాటు చేసేందుకు రిగ్ సాయం తో పనులు ప్రారంభించారు. ఏళ్ల తరబడి తాగునీటికి పడుతున్న కష్టాలు తీరిపోతుండడంతో గ్రామస్తులు హర్షతిరేకాలు వ్యక్తం చేస్తూ, తమ సమస్యల పట్ల అడిగిందే తడవుగా స్పందించి బోరు ఏర్పాటు చేయించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు గ్రామస్తులు, సర్పంచ్ పూనెం వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ అచ్చ నవీన్, వార్డు సభ్యులు చిర్ర ఉప్పలయ్య,పాయం సునీత,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాయం విరాభిమాని చిట్టీమల్ల సతీష్ చారి, కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

## జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి:** బక్రీద్ వేడుకను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ప్రజలు గురువారం నాటి వేడుకను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## జాతీయ రహదారిపై బి ఆర్ ఎస్ పార్టీ రాస్తారోకో



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చెరుకూరు జాతీయ రహదారి పై BRS పార్టీ వాజేడు మండల కమిటీ చెరుకూరు నుంచి ధర్మారం వెళ్ళు రహదారిని వెంటనే నిర్మాణం చేపట్టాలని బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెనుమల్లు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో NH163 రహదారి దిగ్బంధించడం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే దశలవారీగా ఆందోళన చేపడుతామని ఆయన అన్నారు. ఈ రాస్తారోకో కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం పాలక పక్షం పోలీసుల్ని పంపించి రాస్తారోకోని అడ్డుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కొత్తగట్టు సాంబమూర్తి, చింతూరు అయ్యవారిపేట సర్పంచులు మడకం బెనిని, తెల్లం సుమంజలి, మాజీ ఎంపీపీ గొంది స్వరూప, చింతూరు మాజీ సర్పంచ్ తెల్లం బుల్లేస్వర రావు, BRS పార్టీ నాయకులు పాయంజానికి రమణ, బొల్లె సూర్యం, అల్లి సూరిబాబు, సొనప మహేష్ కొత్తగట్టు శ్రీను, బొల్లె ఆదినారాయణ,గార తిరపతి లొట్టపిట్టల రాంబాబు, జజ్జరి సత్యనారాయణ, బీరేబోయిన అదినారాయణ,గరా తిరుపతి బొల్లే శేషు మెట్టుపల్లి గోపాల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**విశాలభారతి పాలకుర్తి:** పాలకుర్తి మండలంలో బుధవారం నిర్వహించిన రైతులకు రాయితీపై పచ్చి రొట్టె విత్తనాల పంపిణీ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొని రైతులకు విత్తన సంచులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల ఆదాయం పెరగడం, భూమి సారవంతం కావడం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. "పొగ లేని పొలం... రోగం లేని గ్రామం" అనే నినాదంతో పొలాల్లో పంట అవశేషాలు, గడ్డి, కొయ్య కాల్చకుండా రైతులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గడ్డి తగలబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు నేల సారం తగ్గే ప్రమాదం ఉంటుందని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వానాకాలం ముందు రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు, జీలుగ, జనుము విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇవి భూమి సారాన్ని పెంచి పంట దిగుబడులకు తోడ్పడతాయని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుస్తూ రైతులకు రుణమాఫీ, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ, సబ్సిడీపై విత్తనాల పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొయ్యలకు నిప్పు పెట్టవద్దని, పర్యావరణాన్ని కాపాడుతూ వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామగుండం ఏఎంసీ చైర్మన్, కన్నాల సింగిల్ విండో చైర్మన్, వ్యవసాయ అధికారులు, ఎంపీడీవో, ఎస్‌హెచ్ఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూల స్పందన



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ప్రకాశ్ గౌడ్ గురువారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సమావేశమై తమ నియోజకవర్గ సమస్యలను వివరించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్గుడా, ఘన్సిమియా గూడా గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ రికార్డుల లోపాలు, హక్కుల నిర్ధారణలో జాప్యం, ప్రభుత్వ పథకాల అమలులో ఆటంకాలు వంటి కారణాలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు తక్షణ సూచనలు జారీ చేయగా, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. అదేవిధంగా, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ చర్యలతో సంబంధిత గ్రామాల ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని స్థానికులు భావిస్తున్నారు. తమ నియోజకవర్గ ప్రజల సమస్యపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత విద్య, వైద్యం టీఆర్ఎస్‌తోనే సాధ్యం

- మే 30న టీఆర్ఎస్ జెండా పండుగను విజయవంతం చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి బేగరి రాజు
- తెలంగాణ జాగృతి బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు కుమ్మరి శివశంకర్




**మొయినాబాద్ , విశాలభారతి:** ఉచిత విద్య, వైద్యం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి బేగరి రాజు అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీఆర్ఎస్ మొయినాబాద్ మండల ఇంచార్జి ఎండీ అన్వర్ ఖాన్, మేకగూడెం బిక్షపతి ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా బేగరి రాజు, తెలంగాణ జాగృతి బీసీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి శివశంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మే 20 నుంచి జూన్ 20 వరకు జెండా పండుగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మే 30న మొయినాబాద్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం వంటి అంశాలపై టీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన హామీలకు ఆకర్షితులై ప్రజలు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మే 30న జరిగే జెండా పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మొయినాబాద్ మున్సిపాలిటీ నాయకులు షేక్ మహ్మద్ నూర్ భాయ్, తెలంగాణ జాగృతి మొయినాబాద్ మండల అధ్యక్షులు సంగేరి నాగేష్, టీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు పవన్, మండల నాయకులు చాకలి విక్రం, కావలి శ్రీను ముదిరాజ్, బొక్క సురేందర్ రెడ్డి, బొక్క రవీందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, మలని రాజు, చాకలి వినోద్ కుమార్, గాండ్ల సంతోష్ కుమార్, బోడ భాస్కర్, నాగారం కృష్ణ యాదవ్, పెద్దింటి శ్రీశైలం ముదిరాజ్, కావలి అమర్ యాదవ్, ఎండీ అలీ, ఎండీ ఇనాయత్, ఎండీ ఏయా, ఎండీ రఫీక్, షేక్ మహ్మద్ అమిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయండి

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్‌కు వినతి**



**నాచారం, విశాలభారతి:** నాచారం డివిజన్ శ్రీనగర్ కాలనీలో ఉన్నటువంటి పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని అలాగే శ్రీనగర్ కాలనీ రోడ్లు కూడా పాడైందని కొత్త సిమెంటు రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. తప్పకుండా తొందరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తామని అలాగే రోడ్లు కూడా వేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేష్ శ్రీనివాస్ బాలకృష్ణ భూషణ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు

## గౌరెల్లి గుట్టలో వైభవంగా స్వాతి నక్షత్ర మహోత్సవాలు

**నేడు స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభిషేకం, సుదర్శన హోమం, గోదాదేవి కల్యాణం – భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కుంట్లూర్ డివిజన్ గౌరెల్లి గ్రామంలోని గౌరెల్లి గుట్టపై వెలసిన శ్రీశ్రీశ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ నెల్లూరి రాజు మాట్లాడుతూ.. స్వామివారికి మహాభిషేకం, సుదర్శన హోమం, అనంతరం శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పుణ్యకార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. స్వామివారి అనుగ్రహం పొందేందుకు సమస్త గ్రామ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకురాళ్లు, యువజన సంఘాల ప్రతినిధులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే ఈ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని భక్తులను కోరారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, భక్తులు పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## టైరు పేలి అదుపుతప్పిన లారీ

- వెనుక నుంచి టిప్పర్ ఢీకొని డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- హయత్‌నగర్ పరిధిలో తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం – క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ నవీన్



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన RJ 10 GA 8723 నంబరు గల కిరాణా సరుకులతో నిండిన లారీ మేడ్చల్ నుండి ఆటోనగర్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో ఉదయం సుమారు 4 గంటల సమయంలో కెప్టెన్ కుక్ సమీపానికి చేరుకోగానే లారీ టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న TG07 W 2459 నంబరు గల టిప్పర్ లారీ అదుపుతప్పి ముందున్న లారీని వెనుక భాగంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరాణా సరుకుల లారీ డ్రైవర్ నవీన్ తీవ్రంగా గాయపడగా, ప్రమాద ధాటికి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్‌ను స్థానికుల సహకారంతో క్యాబిన్ నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ వెల్లడించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పిల్లలకు విద్యాబుద్ధులు అందించాలి

- శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి



**ముషీరాబాద్,విశాలభారతి:** పిల్లలకు విద్య బుద్ధులను అందిస్తే చక్కగా ఎదుగుతారని చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. ప్రతి ఒక్క పిల్లవాడికి సరస్వతి కటాక్షం ఉండాలని అందుకు కళాశాలలు అధ్యాపకులు తల్లిదండ్రుల కృషి ఉండాలని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన యుటోరి జూనియర్ కళాశాలను ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి హాజరై ప్రారంభించి మాట్లాడారు. పిల్లవాడికి చదువు ఉంటేనే కుటుంబం రాష్ట్రం దేశం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. టెక్నాలజీ పరంగా ప్రపంచం పరిగెత్తుతుందని విద్యాబుద్ధులను నేర్పి పిల్లలు కూడా టెక్నాలజీ వైపు పరిగెత్తే విధంగా చేయాలని సూచించారు.

## రైతులకు ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం




**పాల్వంచ, విశాలభారతి:** 12 ఏళ్ల నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులని మోసం చేస్తూ ఎంఎస్పి సీటు ప్లస్ 50 శాతం అమలు చేయకుండా రైతులకు ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ ఎస్కేయం ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు పాల్వంచ మండలం చంద్రాలగూడెంలో ఎమ్మెస్పీ ఆర్డర్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. అనంతరం అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉప సంఘం సిసిఈపి 14 రకాల క్రరీ పంటలకు కనీసం మద్దతు ధరలు ఎంఎస్పి 2026 27నకు పెంచడానికి నిర్ణయం తీసుకుంది 12 సంవత్సరాల క్రితం అధికారంలోకి రాకపూర్వం స్వామి కమిటీ సిఫారసులను అనుసరించి సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదికన కనీసం నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది కానీ ఈ నాటిక ఊసే లేదు. దేశవ్యాప్తంగా రైతులు ఏ వారం మొత్తం రోడ్డుపైకి ఎక్కి ఆందోళనకు పూనుకున్న కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తుందని ఆయన అన్నారు. అలాగే అమెరికా నుంచి ఇక్కడికి దిగుమతి చేసుకుంటున్నా పత్తిపై జీరో సుంకం ఉండడంతో భారతదేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని దళారీ చేతులో తీవ్రంగా మోసపోతున్నారని అన్నారు. కావున అమెరికా సామ్రాజ్యవాదానికి డబల్ టి ఓ విధానాలకు లొంగిపోయిన కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ మే 27 నుండి 31 వరకు జిల్లా కేంద్రాలు మండల కేంద్రాలు గ్రామాల్లో ఎంఎస్పి ఆర్డర్ కాపీలను దగ్ధం చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమము నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో. ఏఐకేఎంఎస్ నాయకులు ఉప్పరపోయిన రామ్మూర్తి, కురుసం బుచ్చయ్య, గుమ్మడి మారయ్య, గుమ్మడి నరసయ్య, తాటి నాగేష్, ఊకే బాబు, ఇడమ, పందు, బీమా, రాధా, రమ,లక్ష్మి, రాములమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

**మహబూబ్‌నగర్ నాట్య బృందం ఆహూతులను అలరించింది**

**మాదాపూర్,విశాలభారతి:** మాదాపూర్‌లోని శిల్పారామంలో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరించింది. మహబూబ్‌నగర్ నుంచి విచ్చేసిన నాట్య గురువు శాంతి గారి శిష్య బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. కళాకారులు గణేశా కౌతం, సూర్యాష్టకం, తాండవమాడెను శివుడు, అన్నయ్య సంకీర్తనలు, గణేశా పంచరత్న, తారంగం, గోవిందా నామాలు, జయ జయ దుర్గే, దేవా దేవాంభజే, మంగళం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. భవిష్య, మహాసేన, నిత్య, వైష్ణవి, లక్ష్య, లాస్యశ్రీ, తన్విక, శ్రీమాన్య, లలిత, మహతి, యశ్వి తదితరులు తమ అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. శాస్త్రీయ నృత్యంలోని హావభావాలు, పాదభేదాలు, తారంగం విన్యాసాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమానికి స్థానికులతో పాటు పర్యాటకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## అనధికార సైరన్లు, ఫ్లాష్ లైట్లపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల కొరడా

- ఒక్కరోజులో 587 కేసులు
- రూ.1.34 లక్షల జరిమానాలు

**సైబరాబాద్,విశాల భారతి**

DGP-TG Special DSR on 03 Violations on 27.05.2026
(Illegal Sirens, Lights and Number Plates)

| Sl. No | Name of the PS | Sirens | | Lights | | Number Plates | |
|---|---|---|---|---|---|---|---|
| | | No.of Cases | Fine Amount | No.of Cases | Fine Amount | No.of Cases | Fine Amount |
| 1 | Madhapur Tr. PS | 1 | 1000 | 3 | 400 | 63 | 12600 |
| 2 | Raidurgam Tr. PS | 2 | 2000 | 2 | 300 | 57 | 11400 |
| 3 | Gachibowli Tr. PS | 0 | 0 | 14 | 2700 | 37 | 8600 |
| 4 | Narsingi Tr. PS | 0 | 0 | 2 | 300 | 43 | 12600 |
| 5 | Kolluru Tr. PS | 0 | 0 | 0 | 0 | 9 | 1800 |
| 6 | RC Puram Tr. PS | 0 | 0 | 0 | 0 | 26 | 5200 |
| 7 | Patancheruv Tr. PS | 0 | 0 | 3 | 600 | 4 | 800 |
| 8 | Miyapur Tr. PS | 5 | 5000 | 16 | 2300 | 36 | 7200 |
| 9 | KPHB Tr. PS | 0 | 0 | 1 | 300 | 82 | 16400 |
| 10 | Kukatpally Tr. PS | 0 | 0 | 1 | 100 | 43 | 8600 |
| 11 | Balanagar Tr. PS | 0 | 0 | 3 | 600 | 19 | 3800 |
| 12 | Jeedimetla Tr. PS | 0 | 0 | 25 | 11600 | 41 | 8200 |
| 13 | Medchal Tr. PS | 0 | 0 | 37 | 7400 | 12 | 2400 |
| | Total | 8 | 8000 | 107 | 26600 | 472 | 99600 |

తెలంగాణ డీజీపీ ఆదేశాల మేరకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేక డీఎస్ఆర్ డ్రైవ్ నిర్వహించి, వాహనాలపై అనుమతి లేకుండా అమర్చిన సైరన్లు, ఫ్లాష్ లైట్లు, నిబంధనలకు విరుద్ధమైన నెంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు రహదారి భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 587 కేసులు నమోదు చేయగా రూ.1,34,200 జరిమానాలు విధించారు. అనుమతి లేని సైరన్లపై 8 కేసులు నమోదు చేసి రూ.8,000, అనధికార ఫ్లాష్‌లైట్లపై 107 కేసుల్లో రూ.26,600 జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నెంబర్ ప్లేట్లపై అత్యధికంగా 472 కేసులు నమోదు చేసి రూ.99,600 జరిమానాలు వసూలు చేశారు. సైరన్ కేసుల్లో మియాపూర్ పరిధిలో అత్యధికంగా 5 కేసులు నమోదు చేసి రూ.5,000 జరిమానా విధించగా, రాయదుర్గంలో 2 కేసులకు రూ.2,000, మాదాపూర్‌లో ఒక కేసుకు రూ.1,000 జరిమానా విధించారు. ఫ్లాష్ లైట్ల వినియోగంపై జీడిమెట్ల పరిధిలో 25 కేసులు నమోదు చేసి రూ.11,600, మేడ్చల్‌లో 37 కేసులకు రూ.7,400 జరిమానా విధించారు. మియాపూర్‌లో 16, గచ్చిబౌలిలో 14 కేసులు నమోదయ్యాయి. నెంబర్ ప్లేట్ల ఉల్లంఘనల్లో కేపీహెచ్‌బీ పరిధిలో అత్యధికంగా 82 కేసులు నమోదు చేసి రూ.16,400 జరిమానా విధించారు. మాదాపూర్‌లో 63, రాయదుర్గంలో 57, నార్సింగి, కూకట్‌పల్లి పరిధుల్లో చెరో 43 కేసులు నమోదు చేశారు. గచ్చిబౌలి, జీడిమెట్ల, మియాపూర్, బాలానగర్, ఆర్సీ పురం, పటాన్‌చెరు, కొల్లూరు తదితర ప్రాంతాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అధికారుల అనుమతి లేకుండా సైరన్లు, ప్రత్యేక లైట్లు వినియోగించడం చట్టవిరుద్ధమని, నెంబర్ ప్లేట్లు మోటారు వాహన చట్టం ప్రకారం ఉండాలని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ప్రజలను కోరారు.

## డీజీపీ సి.వి. ఆనంద్‌తో ఆర్‌టీఐ సాధన కమిటీ భేటీ

- పోలీస్ స్టేషన్లలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని వినతి
- సమాచార హక్కు చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి – చంటి ముదిరాజ్
- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం – డీజీపీ సి.వి. ఆనంద్



**అబ్దుల్లాపూర్ మెట్ , విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన సి.వి . ఆనంద్ ను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ)ను సమర్థవంతంగా అమలు చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు. పోలీస్ శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంపొందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా త్వరితగతిన సేవలు అందే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు సమాచార హక్కు దరఖాస్తుల పరిష్కారంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోలీస్ స్టేషన్లలో ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కల్పించడం, సమాచార అందజేత ప్రక్రియను మరింత సులభతరం చేయడం వంటి అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ... ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు చేసిన సూచనలను సానుకూలంగా పరిశీలించి, సమాచార హక్కు చట్టం అమలులో అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి అజయ్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అరవింద్ స్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బోగం విష్ణు, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గుడ్డేటి ప్రవీణ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

- రూ.6 కోట్ల వరద నీటి కాలువ పనులకు స్థల పరిశీలన
- మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలో ప్రతి వర్షాకాలంలో ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. రాఘవేంద్ర కాలనీ నుండి కుమ్మరి కుంట వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి దాదాపు రూ.6 కోట్ల నిధులు మంజూరు కావడంతో, పనుల ప్రారంభానికి ముందు సంబంధిత ప్రాంతాలను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణానికి సంబంధించిన మార్గాలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, పనుల అమలుపై పలు సూచనలు చేశారు. ప్రతి వర్షాకాలంలో భారీగా వరద నీరు నిల్వ ఉండటంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రాఘవేంద్ర కాలనీ పరిసర ప్రాంతాల్లో ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతోందని పేర్కొన్నారు. రాఘవేంద్ర కాలనీ నుండి కుమ్మరి కుంట వరకు చేపట్టనున్న ఈ వరద నీటి కాలువ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే సమస్యకు గణనీయంగా ఉపశమనం లభిస్తుందని కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిధులు మంజూరు చేయించిందని, పనులు నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి కావాలని అధికారులను కోరారు. అలాగే నిర్మాణ పనులు ప్రారంభించే ముందు అన్ని ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ శివకృష్ణ, ఏఈ సాయి కృష్ణ, రాఘవేంద్ర కాలనీ ప్రధాన కార్యదర్శి చిన్న, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




## మీడియా మిత్రులకు క్రికెట్ టోర్నీ

**జట్ల వివరాలు మే 29లోగా అందజేయాలి .. సైబరాబాద్ సీపీ కార్యాలయం ప్రకటన**

**సైబరాబాద్,విశాలభారతి:** హైదరాబాద్ మహానగరంలో వివిధ కమిషనరేట్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు పరస్పర స్నేహభావం, ఐక్యతను బలోపేతం చేసేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో సీపీ కార్యాలయం పేర్కొంది. ఈ టోర్నీలో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు తమ తమ జట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. జట్టు పేరు, క్రీడాకారుల జాబితా, ఇతర వివరాలను సిద్ధం చేసి రెండు రోజుల్లోగా, అంటే మే 29వ తేదీలోగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ సంజీవ్‌ను 8712663033 నంబర్‌లో సంప్రదించాలని కోరింది. మీడియా మిత్రుల సహకారం, భాగస్వామ్యంతో ఈ క్రీడా వేడుకను విజయవంతం చేయగలమని సైబరాబాద్ కమిషనరేట్ క్రీడా విభాగం ఆశాభావం వ్యక్తం చేసినట్లు ప్రకటనలో తెలిపింది.

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే శేరిలింగంపల్లి ప్రగతి: ఎమ్మెల్యే గాంధీ

**మహానాయకుడికి ఘన నివాళి.. మధుర స్మృతులను పంచుకున్న పీఏసీ చైర్మన్ గాంధీ**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని, ఆయన స్ఫూర్తితోనే హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎదిగానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ అన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన ఆరాధ్యదైవం ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలే తన ప్రస్థానానికి దిక్సూచి అని తెలిపారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, మండల వ్యవస్థ ఏర్పాటు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి చారిత్రక సంస్కరణలను గాంధీ గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ నీడన నేర్చుకున్న విలువలతోనే నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నానని, తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన కీర్తి చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. ఎన్టీఆర్ చూపిన సంక్షేమ బాటలోనే శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధికి పునరంకితం అవుతామని గాంధీ స్పష్టం చేశారు.

## వరద కష్టాలకు చెక్: రూ.79.58 కోట్లతో నాలలకు మహర్దశ

**పనులు వేగవంతం చేయాలి ఎమ్మెల్యే గాంధీ**



నాలా పనులు పరిశీలిస్తున్న గాంధీ

**చందానగర్, విశాల భారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వరద ముంపు సమస్యకు శాశ్వతంగా తెరదించేలా రూ.79.58 కోట్లతో నాలల విస్తరణ పనులు చేపట్టామని పీఏసీ చైర్మన్ ఆరెకెపూడి గాంధీ తెలిపారు. దీప్తి శ్రీనగర్‌లో పటేల్ చెరువు నుంచి గంగారం చెరువు వరకు రూ.18.92 కోట్లతో నిర్మిస్తున్న ఆర్సీసీ బాక్స్ డ్రైన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలంలోపు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. నాలల విస్తరణతో లోతట్టు ప్రాంతాలకు ఉపశమనం కలుగుతుందని, ఇక వరద ముంపు ఉండదని గాంధీ స్పష్టం చేశారు.

## మాధినాగుడాలో కొత్త బ్లడ్ సెంటర్ ప్రారంభం

**రక్తదానం ప్రాణదానంతో సమానం పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే గాంధీ**

**శేరిలింగంపల్లి విశాలభారతి:** మాధినాగుడాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య మాధినాగుడా బ్లడ్ సెంటర్‌ను పీఏసీ చైర్మన్ ఆరెకెపూడి గాంధీ బుధవారం ప్రారంభించారు. తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బ్లడ్ సెంటర్ స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, తలసేమియా చిన్నారులు, ప్రసవ సమయంలో, ప్రమాదాల్లో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రక్తదానం చేసే వారు ఆరోగ్యంగా ఉంటారని, భయపడకుండా యువత ముందుకు రావాలని కోరారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ ప్రెసిడెంట్ వెంకట ప్రసాద్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గురు చరణ్ దూబె తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రం అందజేస్తున్న గాంధీ



## అర్ధరాత్రి వర్షానికి హైదర్‌నగర్ లింక్ రోడ్డు అస్తవ్యస్తం

- ఉప కమీషనర్ చాముండేశ్వరి తనిఖీ
- రోడ్డుపై నిలిచిన బురద నీరు, ఇసుక మేటల తొలగింపు
- తెల్లవారే సరికే రంగంలోకి దిగిన పారిశుధ్య సిబ్బంది



**హైదర్‌నగర్,విశాల భారతి:** మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి హైదర్‌నగర్ లింక్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి, రోడ్డుకు ఇరువైపులా ఇసుక మేటలు వేసింది. ఉదయం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న డీసీ చాముండేశ్వరి వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించారు.హైదర్‌నగర్ డివిజన్243, ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని లింక్ రోడ్డుపై పారిశుధ్య సిబ్బంది పారలు, గడ్డపారలతో నిలిచిన బురద నీటిని తోడుతూ, ఇసుకను తొలగించే పనులను డీసీ దగ్గరుండి పర్యవేక్షించారు.వర్షాకాలంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్లను శుభ్రంగా ఉంచాలని, రోడ్లపై పేరుకున్న మట్టి, ఇసుక, చెత్తను వెంటనే తొలగించాలని డీసీ సిబ్బందికి సూచించారు. రోడ్డు శుభ్రంగా ఉంటేనే ప్రమాదాలు నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఎస్‌డబ్ల్యూఎం వై. శంకర్ గణేష్, ఏఈఈ బన్సీ పాటిల్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఏ రాము, ఇతర పారిశుధ్య విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## చేవెళ్ల లో మహిళా హత్య కాళ్ళు, తల నరికి హత్య చేసిన దుండగులు






**చేవెళ్ల, విశాల భారతి :** చేవెళ్ల మండలంలో చోటుచేసుకున్న ఈ దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చేవెళ్ల మండలంలోని ఈర్లపల్లి రెవెన్యూ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి మైసమ్మ (50) అనే మహిళను గుర్తు తెలియని వ్యక్తులు అత్యంత క్రూరంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామ పరిసర ప్రాంతంలో ఆమె మృతదేహం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే చేవెళ్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు, హత్య చాలా దారుణంగా జరిగినట్లు గుర్తించారు. మహిళకు చెందిన రెండు కాళ్లను నరికి, గొంతు కోసి చంపినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటన తీవ్ర క్రూరత్వాన్ని ప్రతిబింబిస్తోంది. పోలీసుల ప్రాథమిక విచారణలో, మైసమ్మ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, కాళ్లకు ఉన్న వెండి కడియాలు, చెవులకు ఉన్న ఆభరణాల కోసం ఈ హత్య జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. దోపిడీ కోణంలో కేసును పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, స్థానికుల సమాచారం ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామంలో భయాందోళన నెలకొనడంతో పోలీసులు భద్రతా చర్యలను కూడా పెంచారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు త్వరలోనే నిందితులను పట్టుకుని నిజాన్ని బయట పెడతామని తెలిపారు.

## హఫీజ్‌పేట్ డబుల్ బెడ్రూం కమిటీ సభ్యుల భేటీ



మహేష్ యాదవ్‌ను సన్మానిస్తున్న డబుల్ బెడ్ రూమ్ కమిటీ సభ్యులు

**హఫీజ్‌పేట్,విశాల భారతి:** హఫీజ్‌పేట్ డబుల్ బెడ్రూం కాలనీ నూతన కమిటీ సభ్యులు మే 27న బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేశ్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పారిశుధ్యం, తాగునీరు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి తనవంతు సహకారం అందిస్తానని మహేశ్ యాదవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారు వంశీ, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, జాయింట్ సెక్రటరీ బి.రాజు, ఖజాంచి ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవరాజ్‌తో పాటు శ్రీదేవి, ప్రమీల, లావణ్య, అనిల్, వెంకటేష్, కృష్ణ నాయక్, మహేశ్ పాల్గొన్నారు. కాలనీ సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

## ఘనంగా బుర్ర జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు



**సికింద్రాబాద్, విశాల భారతి:** తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, ముదిరాజ్ జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబెర్, ముదిరాజ్ సంఘ నాయకులు తోట సురేందర్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, మోహన్ ముదిరాజ్, రామోజీ, నర్సింగ్ రావు ముదిరాజ్, మేకల శారదా ముదిరాజ్, మాలతి ముదిరాజ్ జ్ఞానేశ్వర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

### విశాల భారతి కథనానికి వెంటనే స్పందన

# ప్రమాదకర ఫ్లెక్సీ తొలగింపు

**కుంట్లూర్ ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు మలుపులో ఏర్పాటు చేసిన స్కూల్ ఫ్లెక్సీ తొలగించిన జీహెచ్ఎంసీ – నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవు: డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్**



అడ్డగోలుగా ఫ్లెక్సీలు.. ప్రజల ప్రాణాలకు ముప్పు..!

- రోడ్డు మలుపులు, చౌరస్తాల్లో ప్రమాదకర హోర్డింగ్స్
- వెంటనే తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీసీకి ప్రజల విజ్ఞప్తి

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :

కుంట్లూర్ డివిజన్ పరిధిలో రోడ్లకు ఇరువైపులా, ముఖ్యంగా మూల మలుపులు, చౌరస్తాల వద్ద అడ్డగోలుగా ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంస్థలు, రాజకీయ నాయకులు ప్రచారం పేరుతో నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా, సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాగోల్ రోడ్డులో నూతనంగా ప్రారంభమవుతున్న శాంక్టస్ వరల్డ్ స్కూల్ - హయత్‌నగర్ బ్రాంచ్ అడ్మిషన్ల ప్రచారం కోసం రహదారులకు అడ్డంగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కుంట్లూర్ చౌరస్తా మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇన్ని ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తున్నారు..? సాధారణ ప్రజలపై వెంటనే జరిమానాలు విధించే అధికారులు, ప్రభావశీలుల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? అంటూ స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ ఫ్లెక్సీల వల్ల ఎప్పుడైనా ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. రోడ్డు భద్రతను పూర్తిగా పక్కనపెట్టి రాజకీయ అండదండలతో విద్యాసంస్థలు, కొంతమంది నాయకులు ప్రచార హడావుడి చేస్తున్నారని, ప్రజల ప్రాణాల కంటే ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి, రహదారులకు అడ్డంగా, మూల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన అన్ని అక్రమ ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే సంబంధిత విద్యాసంస్థలు, రాజకీయ నాయకులపై భారీ జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన అక్రమ ఫ్లెక్సీలపై ఇప్పటికైనా జీహెచ్ఎంసీ యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని, లేకపోతే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

విశాల భారతి Main Edition Page 5 26 May 2026
For Advertisement Call +91 99121 62531



నేడు ఫ్లెక్సీ తొలగించిన తరువాత కుంట్లూర్ x రోడ్డు

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారతి :**

విశాల భారతి తెలుగు దినపత్రికలో మంగళవారం (మే 26) ప్రచురింపబడిన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి, కుంట్లూర్ ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన శాంక్టస్ వరల్డ్ స్కూల్ ఫ్లెక్సీని తొలగించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే విధంగా రహదారికి అడ్డంగా, మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కారణంగా వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కథనంలో ప్రస్తావించడంతో అధికారులు రంగంలోకి దిగారు.జీహెచ్ఎంసీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఫ్లెక్సీని పూర్తిగా తొలగించి, రహదారిని సాధారణ రాకపోకలకు అనుకూలంగా మార్చారు. ఈ సందర్భంగా నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ మాట్లాడుతూ... ప్రజల భద్రతకు భంగం కలిగించే విధంగా అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, హోర్డింగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశాల భారతి ప్రతినిధి కథనాన్ని పరిశీలించిన వెంటనే అధికారులు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రహదారులపై వాహనదారుల దృష్టి మరల్చే విధంగా, ప్రమాదాలకు కారణమయ్యేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం తీవ్ర ఉల్లంఘనగా పరిగణిస్తామని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన నిర్వాహకులపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకునే ప్రక్రియ కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నగరంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని నిత్యానంద్ కోరారు. మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న విశాల భారతి ప్రతినిధి కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ ఘటనతో అక్రమ ఫ్లెక్సీల ఏర్పాటుపై జీహెచ్ఎంసీ మరింత కఠినంగా వ్యవహరించనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



## బీఆర్ఎస్ హయాంలో మోసం కాంగ్రెస్ హయాంలో ఇళ్ల పంపిణీ

- పేదల ఇళ్లపై రాజకీయం
- ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న కేటీఆర్
- కేటీఆర్‌పై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఫైర్
- బోడుప్పల్‌లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలించిన మాజీ మేయర్, మాజీ కార్పోరేటర్లు

**బోడుప్పల్ విశాల భారతి**

మాజీ మంత్రి కేటీఆర్ ఇందిరమ్మ ఇండ్లపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గారు మండిపడ్డారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మేడ్చల్ జిల్లా బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ గారు, మాజీ కార్పొరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్ గారు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ గారు మాట్లాడుతూ... "పేదలకు ఇళ్లు ఇస్తుంటే కేటీఆర్‌కు ఎందుకు ఇంత కడుపు మంటో ప్రజలకు అర్థం కావడం లేదు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేరుతో మోసం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుంటే వాటిపై విమర్శలు చేయడం దౌర్భాగ్యం. ప్రజల సమస్యలు చూడకుండా రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేయడం కేటీఆర్‌కు అలవాటైపోయింది" అని ఘాటుగా విమర్శించా "బీఆర్ఎస్ హయాంలో వేలాది మంది పేదలు ఇళ్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఇండ్ల కేటాయింపులు చేస్తోంది. పేదల ఆనందాన్ని కూడా జీర్ణించుకోలేక కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు మరాటి మల్లేష్,దయ్యాల అలివేలు,రాహూల్,యువజన నాయకులు అసర్ల బీరప్ప,జన్నె రాజు, అంబాల అరవింద్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## వి. హనుమంతరావును కలిసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



మే 27: తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమం మరియు అభివృద్ధి సలహాదారుగా ఇటీవల నియమితులైన సీనియర్ నాయకుడు వి. హనుమంతరావును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో బీసీ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి అంశాలపై అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు. బీసీల అభ్యున్నతికి వి.హనుమంతరావు అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు.

## కొండాపూర్ ఆర్టీఏలో ఏసీబీ ఆకస్మిక సోదాలు

- ఇద్దరు డీఎస్పీలు, నలుగురు ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు
- పెండింగ్ ఫైళ్లు, రిజిస్ట్రేషన్ల తీరుపై క్షుణ్ణ పరిశీలన
- ఏజెంట్ల అక్రమాలపై అందిన ఫిర్యాదులతో చర్యలు



డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు, ఆర్టిఏ ఏజెంట్లను విచారిస్తున్న ఏసీబీ అధికారులు




కొండాపూర్ ఆర్టిఏ కార్యాలయం

**సైబరాబాద్ విశాల భారతి:** కొండాపూర్ ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్టీఏ)లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీలు మాజిద్ అలీ ఖాన్, చలపతిరావు నేతృత్వంలో నలుగురు ఇన్‌స్పెక్టర్ల బృందం ఉదయం నుంచి కార్యాలయంలో సోదాలు నిర్వహించింది.

**ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు...**

ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరుగుతున్నాయని ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. నేరుగా వచ్చే దరఖాస్తుదారుల ఫైళ్లను కావాలనే పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**పెండింగ్ ఫైళ్ళ పరిశీలన...**

పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కార్యాలయ మొత్తం పనితీరుపై అధికారులు సమగ్రంగా దృష్టి సారించారు. విధుల్లో ఉన్న సిబ్బందిని ప్రశ్నించడంతో పాటు, ఆయా విభాగాల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల ప్రకారం లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా లేదా అనే అంశాన్ని నిశితంగా పరిశీలించారు.

**ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూళ్లపై ఆరా...**

కార్యాలయ ఆవరణలో సంచరిస్తున్న ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను కూడా ఏసీబీ బృందం విచారించింది. వాహనదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేసి, ఎలాంటి పరీక్షలు లేకుండా లైసెన్సులు ఇప్పిస్తున్నారా అనే కోణంలో ఆరా తీశారు.ఈ ఆకస్మిక తనిఖీలతో ఆర్టీఏ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

## శంషాబాద్‌లో మహిళ అదృశ్యం.. రెండోసారి మిస్సింగ్ ఘటనతో కలకలం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేస్తోంది. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం, మే 23, 2026న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అతను తన ఇంటి నుండి పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో అతని భార్య మౌనిక @ లక్ష్మి (29), ఇద్దరు పిల్లలు మరియు అతని తండ్రి ఇంట్లోనే ఉన్నారు. అయితే అదే రోజు సాయంత్రం సుమారు 4:45 గంటల ప్రాంతంలో ఫిర్యాదుదారుడి తమ్ముడు మహేష్ ఫోన్ చేసి, వదిన ఇంటి వద్ద కనిపించడం లేదని, పిల్లలు మరియు తండ్రి మాత్రమే ఉన్నారని తెలిపాడు. దీంతో వెంటనే ఫిర్యాదుదారుడు ఇంటికి చేరుకుని చూడగా, అతని భార్య మౌనిక ఇంట్లో కనిపించలేదు. ఈ విషయంపై ఫిర్యాదుదారుడి తండ్రి యాదయ్యను అడిగి తెలుసుకోగా, సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో "షాప్ దగ్గరకు వెళ్తున్నా" అని చెప్పి మౌనిక ఇంటి నుండి బయటకు వెళ్లినట్లు వెల్లడించాడు. అనంతరం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ముఖ్యంగా, ఆమె వద్ద మొబైల్ ఫోన్ కూడా లేకపోవడం గమనార్హం. మౌనిక ఎత్తు సుమారు 5 అడుగులు, చామనచాయ వర్ణం కలిగి ఉండి, తెలుగు మాట్లాడగలదు. అదృశ్యమైన సమయంలో బ్లూ కలర్ పంజాబీ డ్రస్ ధరించి ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా మే 8, 2026న ఇదే విధంగా ఇంటి నుండి వెళ్లిపోవడంతో శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, పోలీసులు ఆమెను గుర్తించి కుటుంబానికి అప్పగించారు. ఈసారి కూడా తిరిగి వస్తుందేమోనని కొంతకాలం వేచిచూసిన కుటుంబ సభ్యులు, చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే ఆమెను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య దురుసు ప్రవర్తనపై ప్రజాగ్రహం

- ఐకియా వద్ద బైకర్‌ను చేయి చేసుకుని తోసేసిన ఎస్ఐ
- బలుప' అంటూ పరుష పదజాలంతో బూతులు
- సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్
- ఉన్నతాధికారుల చర్యల కోసం ప్రజల డిమాండ్

**సైబరాబాద్ - విశాల భారతి**



బైకర్‌పై చేయి చేసుకుంటున్న ఎస్ఐ కృష్ణయ్య



బైకర్‌ను తోసేస్తున్న ఎస్ఐ కృష్ణయ్య.

నగరంలో ట్రాఫిక్ పోలీసుల దురుసు ప్రవర్తన మరోసారి చర్చనీయాంశమైంది. ఐకియా సమీపంలో ఆపదలో ఉన్న వాహనదారుడికి సాయం చేస్తున్న యువకుడిపై ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య అనుచితంగా ప్రవర్తించిన తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అసలేం జరిగింది:** బుధవారం ఉదయం ఐకియా సమీపంలో ఓ కారు మొరాయించింది. ఆ కారులో ఉన్న వ్యక్తి స్నేహితుడు బైక్‌పై అక్కడికి వచ్చి సాయం చేస్తున్నాడు. ఇది గమనించిన విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణయ్య అక్కడికి వచ్చి బైకర్‌తో దురుసుగా మాట్లాడాడు. 'ఇక్కడ బైక్ ఎందుకు ఆపావ్, చలాన్ రాస్తా' అంటూ బెదిరింపులకు దిగాడు. వాస్తవానికి ఆ ప్రాంతంలో 'నో పార్కింగ్' బోర్డు కానీ, వాహనాలు ఆపకూడదనే సూచికలు కానీ లేవు. అయినా ఎస్ఐ కృష్ణయ్య కావాలనే ఇబ్బంది పెడుతున్నాడని గమనించిన బైకర్, తన ఫోన్‌లో వీడియో రికార్డ్ చేయడం మొదలుపెట్టాడు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన ఎస్ఐ 'ఎందుకు సార్ వీడియో తీస్తున్నావ్' అంటూ ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించాడు. అంతటితో ఆగకుండా బైకర్‌పై చేయి చేసుకుని తోసేస్తూ, 'బలుప' అంటూ పరుష పదజాలంతో వాహనదారుడిని బూతులు తిడుతూ దురుసుగా ప్రవర్తించాడు.

**సెల్‌ఫోన్‌లో రికార్డ్, సోషల్ మీడియాలో దుమారం:**

బూతులు తిడుతూ, చేయి చేసుకుని తోసేస్తూ నడుస్తున్న ఎస్ఐ కృష్ణయ్య తీరును అక్కడున్న స్థానికులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ ఘటన సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. వీడియో వైరల్‌గా మారడంతో నెటిజన్లు పోలీసుల తీరును తప్పుబడుతున్నారు.

**స్థానికుల జోక్యంతో వెనక్కి:**

ఎస్ఐ కృష్ణయ్య తీరును గమనించిన స్థానికులు, అక్కడున్న ఇతర వాహనదారులు బాధిత యువకుడికి మద్దతుగా నిలిచారు. 'అతను తప్పేం చేశాడు? సాయం చేస్తే తప్పా? బోర్డు లేని చోట చలాన్ ఎలా వేస్తారు? పైగా బూతులు తిడుతూ చేయి చేసుకుంటారా?' అంటూ ప్రశ్నించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో చేసేది లేక ఆ ఎస్ఐ అక్కడి నుంచి వెనక్కి తగ్గాడు. 'మీ ఇష్టం వచ్చినట్టు చేయండి' అంటూ వెళ్లిపోయాడు.

**ప్రజాగ్రహం:**

'ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజలపైనే పెత్తనం చేస్తారా? ఆపదలో ఉంటే సాయం చేయాల్సింది పోయి బూతులు తిడుతూ చేయి చేసుకుంటారా?' అని నెటిజన్లు మండిపడుతున్నారు. యూనిఫాం వేసుకున్న బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కూడా ఎస్ఐ కృష్ణయ్య ఇలా ప్రవర్తించడమేంటని నిలదీస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి:**

ఎస్ఐ స్థాయి అధికారే ఇలా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ ఘటనపై ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీ స్థాయి ఉన్నతాధికారులు విచారణ జరిపి, ఎస్ఐ కృష్ణయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పరుష పదజాలం వాడినందుకు, దురుసుగా ప్రవర్తించినందుకు బహిరంగ క్షమాపణ చెప్పించాలని కోరుతున్నారు. 'పోలీస్ అంటే ప్రజలకు రక్షకులుగా ఉండాలి కానీ భక్షకులుగా మారవద్దు. ఖాకీకి ఉన్న గౌరవాన్ని కాపాడుకోవాలి' అని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందికి ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



# విదేశాల్లో భారతీయ విద్యార్థుల దయనీయ పరిస్థితి

**రూపాయి పతనం లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి: కప్పాటి పాండురంగా రెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్,విశాల భారతి :** డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి విలువ నానాటికీ క్షీణించడం కేవలం ఆర్థిక గణాంకాలకే పరిమితమైన అంశం కాదని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న లక్షలాది మంది భారతీయ విద్యార్థుల జీవితాలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై చదువుకుని కుటుంబాలకు అండగా నిలవాలనే ఆశయంతో వెళ్లిన సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ప్రస్తుతం చదువు కంటే మనుగడ కోసం ఎక్కువగా పోరాడాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటంతో విదేశాల్లో జీవన వ్యయం అమాంతం పెరిగిపోయిందని, భారతదేశం నుంచి తల్లిదండ్రులు పంపిస్తున్న డబ్బు కనీస అవసరాలకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు .ఈ సందర్భంగా విద్యార్థుల దయనీయ పరిస్థితిని వివరిస్తూ పాండురంగా రెడ్డి పలు అంశాలను ప్రస్తావించారు. ఖర్చులు తగ్గించుకోవడానికి కొందరు విద్యార్థులు రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేస్తుండగా, మరికొందరు ఆకలితోనే రోజులు గడుపుతున్నారని తెలిపారు. బస్సు, సబ్‌వే ఛార్జీలను భరించలేక ప్రతిరోజూ కిలోమీటర్ల కొద్దీ కాలినడకన ప్రయాణిస్తూ శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని చెప్పారు.అదేవిధంగా చదువుతో పాటు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ, డిపార్ట్‌మెంటల్ స్టోర్లు, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రదేశాల్లో శ్రమతో కూడిన పనులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఆకలి, అలసట, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారని, దీని ప్రభావం వారి విద్యా ఫలితాలు, ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన యువత విదేశాల్లో కనీస అవసరాల కోసం అల్లాడిపోవడం ఆందోళనకరమని పేర్కొన్న ఆయన, డాలర్‌తో రూపాయి పతనాన్ని కేవలం ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు.విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సమస్యలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరమైన ఆర్థిక సహాయం, ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, విద్యా రుణాల్లో సడలింపులు వంటి అంశాలను పరిశీలించి విద్యార్థులకు అండగా నిలవాలని కప్పాటి పాండురంగా రెడ్డి ప్రభుత్వాలను కోరారు.

# వారం రోజుల్లో 6 సైబర్ నేరాలు ఛేదన

- ట్రేడింగ్ ఫ్రాడ్‌లే ఎక్కువ 10 మంది అరెస్టు .. బాధితులకు రూ.1.39 కోట్లు రీఫండ్

**సైబరాబాద్,విశాలభారతి:** సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వారం రోజుల్లో దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ నేరముఠాలపై ఉక్కుపాదం మోపారు. మే 20 నుంచి 26 వరకు 6 కేసులను ఛేదించి వివిధ రాష్ట్రాలకు చెందిన 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ టి. సాయి మనోహర్ బుధవారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో నలుగురు ట్రేడింగ్ ఫ్రాడ్‌కు పాల్పడిన వారే కావడం విశేషం.నమోదైన కేసుల్లో రెండు ట్రేడింగ్ ఫ్రాడ్‌లు కాగా, ఇంపర్సనేషన్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, విషింగ్ కాల్ ఫ్రాడ్ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. విషింగ్ కాల్ ఫ్రాడ్ కేసులో ముగ్గురు నిందితులు పట్టుబడగా, మిగిలిన కేసుల్లో ఒక్కొక్కరిని అరెస్టు చేశారు.ఈ వారంలో కీలకమైన కేసు నకిలీ 'ACEFD' ట్రేడింగ్ యాప్‌కు సంబంధించింది. '77 Accel Partners Stock Exchange Group' పేరుతో వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తూ బ్లాక్ ట్రేడింగ్, ఐపీఓ అలాట్‌మెంట్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ పేరుతో భారీ లాభాల ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి రూ.7,19,964 కాజేశారు. నకిలీ యాప్‌లో వర్చువల్ లాభాలు చూపించి నమ్మించిన నిందితులు, డబ్బును పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించారు. మొదట చిన్న మొత్తాలు విత్‌డ్రా చేసే అవకాశం ఇచ్చి నమ్మకం కలిగించారు. భారీగా సొమ్ము జమ అయ్యాక విత్‌డ్రాలను నిలిపివేసి, అదనపు కమీషన్ చెల్లిస్తేనే డబ్బు ఇస్తామని బెదిరించారు. మోసం గ్రహించేలోపు వాట్సాప్ గ్రూప్‌ను మ్యూట్ చేసి పరారయ్యారు.ఈ కేసులో సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి, మోసపూరిత సొమ్మును మళ్లించేందుకు కమీషన్ తీసుకున్న ఢిల్లీకి చెందిన అసిమ్ ఖాన్, షాజెబ్ ఖాన్, మొహమ్మద్ కమ్రాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.అదే సమయంలో బాధితులకు ఊరట కలిగేలా 70 కేసుల్లో 440 రీఫండ్ ఆర్డర్లు సాధించి రూ.1,39,39,325 తిరిగి ఇప్పించినట్లు డీసీపీ తెలిపారు. సోషల్ మీడియా, వాట్సాప్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపుల్లో అధిక లాభాల హామీలను నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. ట్రేడింగ్ యాప్‌లు, సంస్థల విశ్వసనీయతను సెబీ వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవాలని, తెలియని లింకుల నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేయొద్దని, మోసపోతే వెంటనే http://www.cybercrime.gov.in లో లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.



సైబర్ క్రైమ్స్ డిసిపి టి.సాయి మనోహర్

# దక్షిణ అయోధ్యలో ధ్వంసమైన జాతీయ రహదారులు

- పాలకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలకు నిలయంగా భద్రాచలం
- సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి
- ధ్వంసం అయిన జాతీయ రహదారిపై సిపిఐఎం ఆధ్వర్యంలో నిరసన



**భద్రాచలం, విశాలభారతి:** దక్షిణయోధ్యగా విరజిల్లుతున్న భద్రాచలం పట్టణంలో జాతీయ రహదారులు దారుణంగా ధ్వంసం అయిపోతున్నాయని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి అన్నారు. ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో పవిత్ర పుణ్యక్షేత్రం ప్రమాదాలకు నిలయంగా మారిందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మరమ్మతులకు గురైన ప్రమాదాలకు కారణమవుతున్న చర్ల రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ చర్ల వెంకటాపురం మండలాల నుండి వచ్చే ఇసుక లారీలతో భద్రాచలం నుండి వెంకటాపురం వరకు జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోతుందని అన్నారు. ప్రధానంగా భద్రాచలం పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుండి నన్నపనేని మోహన్ హైస్కూల్ వరకు తారుతో పోసిన జాతీయ రహదారి విధ్వంసంగా మారిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులు పర్ణశాలకు వెళ్లాలంటే చుక్కలు కనబడుతున్నాయని ఒక్కసారి ఈ రహదారిపై ప్రయాణించిన యాత్రికులు మరోసారి భద్రాచలం పేరు ఎత్తితేనే భయపడిపోయే పరిస్థితులు వచ్చాయని అన్నారు. జాతీయ రహదారుల మరమ్మతులు చేపట్టాలని సిపిఐఎం ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా దశల వారి ఉద్యమాలను చేస్తున్న పాలకులు స్పందించడం లేదని అన్నారు. సిపిఎం జిల్లా రాష్ట్ర స్థాయి నాయకత్వం పలుమార్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు వినతి పత్రాలు అందించారని నర్సారెడ్డి సందర్భంగా గుర్తు చేశారు. రోడ్డు భవనాల శాఖ మంత్రి తోపాటు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రెవిన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన హామీ ప్రకటనలకే పరిమితమైందని ఇప్పటివరకు రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం చొరవ చూపలేదని నర్సారెడ్డి ఆరోపించారు. ఇటీవల జరిగిన అత్యధిక రోడ్డు ప్రమాదాలు ఈ రహదారి పైనే జరిగిన పాలకులు స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రజా పాలన ప్రగతి పాలన పేరుతో సొంత ప్రచారాలు చేసుకుంటున్న ప్రభుత్వం దక్షిణాయోధ్య రహదారులపై శ్రద్ధ చూపాలని నరసారెడ్డి హితవు పలికారు. యుద్ధ ప్రాతిపదికన భద్రాచలం పట్టణంలోని జాతీయ రహదారి మరమ్మతులు పనులు చేపట్టకపోతే సిపిఐ ఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్ పార్టీ నాయకులు అంజి భూషణం శ్రీను రమేషు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను గడువు తేదీలోగా పరిష్కరించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ, విశాలభారతి:** రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను గడువు తేదీలోగా తహసీల్దార్లు పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో భూభారతి పోర్టల్, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన, సాదా బైనామా దరఖాస్తులు, రెవెన్యూ సంబంధిత అంశాలపై ఆర్డీవో, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంబంధిత అంశాలపై తహసీల్దార్లతో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆర్ఐ రిపోర్ట్ ఆధారంగా నిబంధనల మేరకు వాటిని పరిష్కరించాలని అన్నారు.

# యూపీలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం.. మన సమాజం చెడిపోయిందన్న బాలీవుడ్ నటి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లాలో తొమ్మిదేళ్ల దళిత బాలికపై ఇద్దరు మైనర్ బాలురు లైంగిక దాడికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. అయితే ఈ దారుణ ఘటనపై బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ తీవ్రంగా స్పందించారు. మన పిల్లలు ఎటువంటి వాతావరణంలో పెరుగుతున్నారో ఆలోచించాలని కోరిన ఆమె, ఈ ఉదంతం మన దెబ్బతిన్న సమాజానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న వరుస దాడులపై ప్రజల్లో ఆందోళన పెరుగుతున్న తరుణంలో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. బల్లియా జిల్లా హల్దీ ప్రాంతంలో బాధితురాలి గ్రామానికే చెందిన 11, 12 సంవత్సరాల వయసున్న ఇద్దరు మైనర్ బాలురు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను భూమి పెడ్నేకర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకుంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అసలు ఏం జరుగుతోందని, మన పిల్లలకు ఎలాంటి పరిస్థితులు కల్పిస్తున్నామో చూసి కూడా మనం ఎందుకు అప్రమత్తం కావడం లేదని, సిగ్గుపడటం లేదని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనలో ఆ చిన్నారితో పాటు, సదరు మైనర్ బాలురు కూడా ఈ చెడిపోయిన సమాజం సృష్టించిన బాధితులేనని ఆమె అభిప్రాయపడ్డారు. సమాజంలో మహిళలపై ఎదురవుతున్న వేధింపులపై భూమి స్పందించడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల ఒక మహిళ గోడ పెయింటింగ్‌ను ఉద్దేశించి ఒక యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించిన వైరల్ వీడియోపై కూడా ఆమె ఘాటుగా స్పందించారు. నేటి యువత మానసిక స్థితి ఇలాగే ఉంటే, భవిష్యత్తులో వారు మహిళలు, పిల్లలపై దాడులకు తెగబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేవలం మాటలు, సానుభూతి సరిపోవని, ఇటువంటి నేరాలను అరికట్టడానికి అత్యంత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె డిమాండ్ చేశారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.